# ఆఖరి పువ్వు

చుట్టూ చీకటిగా వుంది. కన్ను పొడుచుకున్నా కనిపించనంతటి కారు చీకటి.

పోనీ పైన చూద్దామంటే ఆకాశం కూడా మబ్బు కప్పేసి వుంది. మబ్బు కప్పు వెనక చుక్కలన్నీ నక్కి వున్నాయి. చంద్రుడూ లేడు. అలా నిరామయంగా వున్న చీకటి ఆకాశం వంక చూస్తోంటే గుండెల నిండా గుబులు పొగులుతూంది.

పిట్టా పిచ్చుకా గూళ్ళల్లో తలలు దాచుకున్నాయి.

చెట్టూ చేమా నిద్రకు సిద్ధమవుతున్నాయి.

అంతటా నిశ్శబ్దత. మామూలు నిశ్శబ్దం కాదు. కరుడుగట్టిన నిశ్శబ్దం.

అట్టి నిశ్శబ్ద వాతావరణంలో ఎక్కడ్నుంచో 'ఠంగ్' మని గంట మ్రోత వినిపించింది.

ఆ మ్రోతకు నేను వులిక్కిపడ్డాను. నా గుండె ఝల్లుమంది. మళ్ళీ ఠంగ్‌మని వినిపించింది. మళ్ళీ వులిక్కిపడ్డాను.

ఈ సారి ఠంగ్ ఠంగ్ మని వరుసగా వినిపిస్తోంది.

ఆ మ్రోత నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ గురిపెట్టిన బాణంలాగా గాలి వాలులోంచి దూసుకువస్తోంది. నేరుగా నా గుండెల్ని తాకుతూంది.

భయంతో నాలో నేను ముడుచుకున్నాను....

ఆ గంట మ్రోత ఆగిపోయింది. మళ్ళీ నిశ్శబ్దం పేరుకుంది.

గాలి భుజాలెక్కి వచ్చి - నేరుగా నా గుండెల్లో మ్రోగుతున్నట్లనిపించిన ఆ గంట మ్రోత ఎక్కడిదా అని అప్పుడు చుట్టూతా కలియచూశాను. మెల్లిగా నా దృష్టిని సారించి నలువంకలా చూశాను.

అప్పుడు కనిపించింది - దూరంగా, ఎత్తుగా మిణుకు మిణుకు మంటూ.

అది నక్షత్రమైతే కాదు. మబ్బులు గుబుర్లుగుబుర్లుగా వ్రేలాడుతున్నాయి. ఆకాశంలో నక్షత్రం వుండటానికి ఆస్కారం లేదు.

మరీ నిదానించి చూద్దును కదా - అదొక దీపం. దూరంగా వున్న గట్టు మీద నుంచి కనిపిస్తోంది. చీకటి సరస్సులో తెల్ల హంసలాగా వుంది; చీకటి సముద్రంలో వంటరి పడవ తెల్లటి తెరచాప లాగా వుంది.

దూరంగా కనిపిస్తోన్న ఆ దీపాన్ని చూడగానే నా గుండెల్లో ఏదో అలజడి మొదలైంది. నా అంతరాంతరాల్లో ఏదో సన్నగా జివజివలాడింది.

మళ్ళీ గంట మ్రోత వినిపించింది.

ఈ గంట మ్రోత కూడా దూరాన వున్న ఆ గట్టు మీద నుంచే వినిపిస్తోంది.

ఈ గంట మ్రోతా, ఆ మిణుకుమనే దీపమూ - నా గుండెల్లో చిరు సవ్వడివి - సన్నటి అలజడినీ రేపుతున్నాయి! ఎద యిరుకుల్లో ఏదో కదలాడుతున్నట్లనిపిస్తోంది.

ఆ దీపం ఏంటి - ఈ గంట మ్రోతేమిటర్రా అంటే ఎవరూ పలకరూ - వులకరూ!

ఈ ముసలాడ్ని ఎవరూ పట్టించుకోరు.

అయినా అడిగాను మళ్ళీ మళ్ళీ .....

కొబ్బరి చెట్టు చల్లగాలనే కల్లు త్రాగినోడులాగా వూరికో వూగిపోతూంది. ఆ త్రాగుబోతుకు నా మాట తలకెక్కేనా?

క్రొత్త అంటు మామిడి చెట్టు, క్రొత్తగా పమిటేసుకున్న పడుచుపిల్ల మాటిమాటికీ పమిట సర్దుకుంటున్నట్లు వూరికే అటూ ఇటూ కదులుతూ తెగ వయ్యారాలు పోతూంది. దానికి నా మాట చెవిన పడుతుందా?

ఇక గున్నమామిడి చెట్టు గున్నేనుగు కూర్చుందా అన్నట్లు మాగన్నుగా వుంది. ఈ ముసలాడి ప్రశ్న దాని మతికేం ఎక్కుతుంది?

ఆ సంపెంగ చెట్టుందీ అంటే, చీకటి పడగానే విటులతో కులికే కులటలాగా త్రాచుల్తో సావాసం! ఈ ముసలాడి మాట దాని చెవికి సోకదు - ఆ పాముల బుస్సబుస్సల కామ సంగీతపు రొదల్లో!

అదిగో ఆ నైట్క్వీన్ చెట్టు వుందంటే దాని పేర్లోనే వుంది - దాని నీటూ గోటూనూ! గాలి తెమ్మెర్లు వింజామరలు వీస్తోంటే మహారాణి పోజులో గుత్తులు గుత్తులుగా వికసించి, పరిమళించి గాలి మిండడుతో సయ్యాటలాడుతూ, సరాగాలు పోతూంది. ఈ ముసలాడి మాటకి ఈసడించుకుంటుంది గాని సమాధానం చెప్పుతుందా?

పోతే, ఏదో క్రొత్తగా వచ్చిన ఆ క్రోటన్ మొక్కలున్నాయంటే అవి మన జాతివికావు. అస్సలు ఈ దేశానివే కావు. వాట్ని అడుగుదామంటే వాటి భాష ఏంటో నాకు తెల్సిచావదు!

మరి, మా మల్లి చెట్లున్నాయంటే సాటి కులస్థుడంటే వీటికి గిట్టిచావదు! (కులగజ్జి కుత్తుకల దాకా పట్టిన ఈ రాజకీయ నాయకులనూ, ఈ ఆఫీసర్లనూ చూసైనా కనీసం కులాభిమానం పెంచుకోవు!) పైగా వయస్సులో మిడిసిపడుతున్నాయి! ఈ వయస్సుడిగిన ఈ ముసలి మల్లిచెట్టును చీదరించుకుంటాయి!!

ఈ గెస్టౌసు ఆవరణలో యింకా ఏవేవో పొదలూ, చెట్లూ, చేమలూ వున్నాయి. వాటి మీద ఎవరికీ అజమాయిషీ లేనందువల్ల మీ 'మిలిటెంట్లు' లాగా చీకిరి బాకిరిగా పెరిగి చిందరవందరగా వున్నాయి.

మరి, నా గుండెల్ని కదుపుతున్న, నా ఆయువు పట్టును కుదుపుతున్న ఆ మిణుకు మిణుకుమనే దీపం - గుండెల్ని తాకే ఈ గంట మ్రోతను గురించి ఇంకెవర్ని అడగాలి?

ఎవర్ని అడిగితే ఎవరు చెప్పుతారు?

వయస్సు మళ్ళి, జీవశక్తులన్నీ వుడిగిపోయిన ఈ ముస్సలాడి మాటను ఎవరు ఖాతరు చేస్తారు?

అలా అని గమ్మునా వుండలేకపోతున్నాను.... ఆ మ్రోత వింటుంటే, మిణుకు మిణుకుమనే ఆ చిరుదీపాన్ని చూస్తుంటే నాలోని 'జీవుడు' జివజివలాడిపోతున్నాడు.

- ఇంతలో ఈ గెస్టాసును చూచే రంగన్న గుడిశెలోంచి అతని భార్య బయటికి వచ్చింది.

ఆమె భుజం మీద ఒక బుడతడు పడుకుని వున్నాడు. వాడు వూరికే పోరుపెట్టుతున్నాడు. వాడ్ని చేత్తో జోకొట్టుతూ, "పిల్లాడికి ఈవజాన వళ్ళు కాలిపోతూంది! నాకు కాలూ చెయ్యా ఆడకుండా వుంది. ఈ ముదనట్టపోడు తాగడానికి వూళ్ళోకి వుప్పుడే సావాలా? ఈ అడవిలో, ఈ పాడు కొంపలో పిలిచినా పలికే దిక్కుండదు!" అని తనలో తాను గొణుక్కుంటూంది.

అదొక యిల్లాలి ఘోష! ఒక కన్నతల్లి ఆవేదన!

చీకటి పడగానే రంగన్నకు గొంతులో చుక్క పడాలి! ఆ చుక్క పడేదాకా శివాలు తొక్కుతాడు. అందుకే, పొద్దుకూకే వేళకు రోడ్డుమీదకెళ్ళి బస్సులాగే సెంటర్లో ఆదిలచ్చి సారా పాకకు పారెల్లుతాడు.

"..... గట్టు మీద పాడుబడ్డ శివాలయంలోకి ఎవరో పంతులు గారొచ్చి దీపం పెట్టిపూజలు సేత్తున్నాడంట! బుడ్డోడ్ని ఆయన కాడికి తీసికెళ్ళి ఈబూది పెట్టిద్దామంటే ఈ సచ్చినోడు సారా కొట్టుకెళ్ళాడు!.... రేపయినా తీసికెళ్ళాలి! వుండరాతండ్రి వుండు!...." అని ఏడుస్తోన్న పిల్లాడ్ని సముదాయిస్తోంది.

అదీ సంగతి!

నేను వింది ఆ శివుడి గుడి గంట! చూచింది ఆ గుడి దీపం!

ఇలాటి గంట వింటం, అలాంటి దీపాన్ని చూడటం నాకిదే మొదటిసారి!

ఆ గట్టుమీద ఒక గుడి వుందన్న విషయం నాకు తెలియనే తెలియదు. ఆ గుడిలో శివుడున్నాడని నా కిన్నేళ్ళుగా తెలియదు! ఈ గంట మ్రోతలో గుండెల్ని కుదిపే శక్తి వుందనీ - ఆ చిరుదీపంలో మనస్సుకు పట్టిన చీకటి మీద కాగడాలు వెలిగించే మహత్యం వుందని నా కిన్నాళ్ళుగా తెలియదు! అస్సలికి ఆ శివుడు 'ఎరుకే' లేదు. ఆ 'ఎరుక' లేకుండానే ఈ బతుకంతా గడిచిపోయింది! యవ్వనం అందించే కులాసాతో, వయస్సు యిచ్చే ధిలాసాతో రోజులన్నీ గడిచిపోయాయి. పరువాల పొగరుతో మిడిసిపడ్డాను.

.... ఆ రోజులన్నీ - ఆ గత వైభవాలన్నీ గుర్తుకు వచ్చాయి!

ఈ తోట ఒక ధనికుడిది. ఆయన టౌన్లో వుంటాడు. ఆ టౌను ఇక్కడికి పాతికమైళ్ళ దూరంలో వుంటుందంట. ఆయనొక విలాసపురుషుడు. ఈ తోటలో అదిగో ఆ కనిపిస్తోన్న గెస్ట్ హౌస్ కట్టించాడాయన. ధనంతో పాటు రసికతా వుంది. అప్పుడప్పుడు యిక్కడికి కార్లో వచ్చేవాడు. వచ్చేటప్పుడల్లా ఒక క్రొత్త పడుచును వెంటపెట్టుకుని వచ్చేవాడు.

వచ్చినప్పుడల్లా ఆటవిడుపుగా మూడు నాల్గు రోజులు వుండేవాడు. ఆ వున్నన్ని రోజులూ

విందులూ, విలాసాలూ - రాత్రనకా, పగలనకా ఆ వెంట తెచ్చుకున్న పడుచుతో కులికేవాడు.

శృంగార రసవాహిన్లో మునకలేసేవాడు. ఈ రంగయ్య చేత రకరకాల మాంస భక్ష్యాలు వండించుకునేవాడు. విదేశీ పానీయాలు గ్రోలేవాడు. ఆ నాల్గురోజులూ ఈ తోట తోట కాదు. - శృంగార బృందావనం! ఆ మేడ మేడ కాదు. రతీమన్మధుల శృంగార కేళీమందిరం!

వూళ్ళో పెళ్ళి - కుక్కలకు హడావుడి అన్నట్లు ఆ నాల్గురోజులూ నాకెంతో సంబరం..... సందడీ, వుషారున్నూ!

పెరట్లో పడివున్న మల్లిచెట్టువు. నీకేమిటి సంబరం, వుషారు అంటున్నారు కదూ బాబు?

అదే మనవి చేస్తాను.

ఆ ధనికుడి వెంట వచ్చిన సుందరీమణులను చూడగానే - వాళ్ళ కేశ సౌందర్యం, అవయవాల సౌంకం, వక్షోజాల బింకం, బిట్టుగా వున్న వాళ్ళ జఘనం నాలో వింత వింత కోర్కెలను రేపేవి. నా నరాలన్నీ (వ్రేళ్ళన్నీ) జివ్వుమనేవి! నా అంగాంగాల జీవశక్తులన్నీ పొర్లేవి... నేను విరగచూసేవాడ్ని.... విరగబూసేవాడ్ని!

ఆ పడుచుదనపు రోజుల్లో నా వంట్లో బోలెడు సత్తువుండేది. అందుకే ఫెళ్ళున విరగబూసేదాన్ని, ఆ కోమలాంగుల వునికి పూవులో, కైపులో!.... అలా నాపూచిన ప్రతి పువ్వులోనూ, ప్రతి పూరేకులోనూ నాలోని స్త్రీ సౌందర్యకాంక్ష నిక్షిప్తమై వుండేది!

అయ్యా, తమరి నొసలు ముడిపడుతున్నాయి - నాక్కనిపిస్తూనే వుంది! మీలో ఒక అనుమానం కలుగుతూ వుంది. అది నాకు తెలుస్తూనే వుంది!

మీరంటారు - నీవ్వాక మల్లిచెట్టువు కదా! మల్లి చెట్టు అంటే స్త్రీ లింగం కదా - ఒక స్త్రీవై వుండి ఎలా కాంక్షించావు అంటున్నారు! అదే కదయ్యా. మీ అనుమానం!

మల్లిచెట్టు అంటే స్త్రీ శబ్దమని మీ పండితులు అన్నారు గానీ! అస్సలు మల్లిచెట్టంటే - ఆ మాటకొస్తే ఏ పువ్వు చెట్టయినా ఆడదో, మొగదో మీరెలా నిర్ణయిస్తారు? మీలో కొందరు చందమామని మొగవాడుగా, మరికొందరు స్త్రీగా - సందర్భాన్ని బట్టి వాడుకుంటూ వుంటారు. ఇది కూడా అదే అనుకోండి పోనీ? నేను స్త్రీ సౌందర్యాన్ని ఆస్వాదించే రసపురుషుడ్ని - సౌందర్య పిపాసిని అనుకోండి! కాదంటారా, ఇప్పుడు మీలో కూడా స్వలింగ సంపర్కం లాంటి వింత లైంగిక రీతులున్నాయిగా! నేను కూడా ఆ బాపతే అనుకోండి! స్త్రీనై వుండి మరో స్త్రీ సంపర్కం కోరే వింత మానిని అనుకోండి!

.... సరే, ఇంతకీ చెప్పుతున్నదేమిటంటే -

నేను పూచే ప్రతి పువ్వులోనూ, ప్రతి పూ రేకుల్లోనూ నాలోని స్త్రీ సౌందర్య కాంక్ష నిండి వుండేది!

ప్రతి పువ్వులోనూ నేనే అయి.

పూ పరిమళంలోనూ నేనే అయి -

ఆ పరిమళ మిళితుడ్నయి నా కాంక్షాకరాలు చాచుకుంటూ, ఆ సువాసనల్లో తేలుకుంటూ, గాలి కెరటాల్లో ఈదుకుంటూ -

యింటి గుమ్మాల్లోంచి -

కిటికీ సందుల్లోంచి - పరదాల్లోంచి

ఆ పడగ్గదిలోకి చొరబడి -

ఆ పాన్పు మీద పవ్వళించిన మదవతుల ఎదలమీద వాలేవాడ్ని! వాళ్ళ నునుపు చెక్కిళ్ళను నిమిరేవాడ్ని! వాళ్ళను నా సువాసనల్తో వుక్కిరిబిక్కిరి చేసేవాడ్ని!

నా పరిమళాల మత్తులో, నా పిలుపందుకుని ఆడపడుచులు బయటికి వచ్చి నాచుట్టూ అబ్బురంతో, మురిపెంతో ప్రదక్షిణాలు చేసేవాళ్ళు!

నేనప్పుడు పువ్వు పువ్వులో కన్నుగీటేవాడ్ని! వాళ్ళకు నా పట్ల మోజులు పుట్టించేవాడ్ని. దాంతో, వాళ్ళు నా పువ్వులన్నీ కోసుకుని పమిట చెంగుల్లో పోసుకునేవాళ్ళు. 'ఆహా' అని వాసనలు చూసేవాళ్ళు. అప్పుడు నేను కొంటెగా వాళ్ళ బుగ్గలు మీటేవాడ్ని! వాళ్ళ అధరాలను తాకేవాడ్ని!

ఆ సుందరాంగులు నా పూలను పెద్ద పెద్ద మాలలుగా కట్టి వాళ్ళ సిగల్లో ముడుచుకునేవాళ్ళు. వాళ్ళ వాల్జడల్లో తురుముకునేవాళ్ళు.

తమకు ముందే మనవి జేసుకున్నాను. నా ప్రతిపువ్వులోనూ, పూ రేకులోనూ నేనేనని. నా స్త్రీ కాంక్షేనని. అందుకే సిగలో ముడిచినా, జడలో తురిమినా నా పూమాలలన్నీ మాటిమాటికీ వాళ్ళ వక్షసీమల మీదకే జారేవి. వాళ్ళ చనుదోయితో దోబూచులాడేవి!

ఆ ధనికుడు బహు రసికుడని తమకు ముందే చెప్పాను. అతడు రసికుడే కాదు. బహు చపలుడు. ఒక్కోసారి అతని శృంగారం వింత పోకళ్ళు పొయ్యేది! అతడు ఆ కామినులను వివస్త్రలను చేసేవాడు. వాళ్ళను పూర్తిగా మల్లిపూలతో కప్పేవాడు. ఆ తర్వాత తీరిగ్గా కూర్చుని దేవతా విగ్రహాలకు చందనాన్ని వలుస్తున్నట్లు - మేలి ముసుగులను వత్తిగించి చూస్తోన్నట్లు అక్కడొక పువ్వూ, యిక్కడొక పువ్వూ తీసి చూచి ఆనందించేవాడు!... అదంతా ఒక వింతహేల. శృంగార లీల! తెలి మంచు తెరలు మెల్ల మెల్లగా తొలగుతుంటె - కరుగుతుంటే ప్రకృతి సౌందర్యం క్రమక్రమంగా ప్రకటమౌతున్న అద్భుత దృశ్యం!

..... రెండు గుపెళ్ళ మల్లిపూలు తొలగించగానే మహోన్నత వక్షగిరులు. నాలుగు మల్లి పూలు తీయగానే లోతైన నాభి ప్రదేశం..... ఇలా మీరే వూహించుకోండి!

చెప్పొచ్చేదేమిటంటే - నా పూలన్నీ అలా ఆ లతాంగుల ప్రతి అంగం మీద మళ్ళీ పుష్పించేవి. వాళ్ల సౌందర్యకాంతులు గొంతు నిండా త్రాగేవి! ఆ మత్తులో గంతులేసేవి. వాళ్ళ బంగారు మేని స్పర్శతో పులకించిపోయేవి.

..... ఇదంతా నాకొక వింత అనుభవం! ఆ విధంగా ఆ విలాసిన్ల నగ్న శరీరాలని తాకటం, ఆ రోజుల్లో ఆ వయస్సు వేడిలో, ఆ నరాల మత్తులో, ఆ నాటి పడుచు రక్తం చేసే గమ్మత్తులో - అదిచాలా గొప్పగా, ఏదో థ్రిల్లింగుగా వుండేది!

.... అవన్నీ వంటికి కావరం పట్టి, కామంతో కన్నూ మిన్నూ కానక కులికిన కుళ్ళు రోజులని నాకిప్పుడు అనిపిస్తోంది!

ఇలా ఎన్నో వసంతాలు, మరెన్నో వసంత రాత్రులూ గడిచిపోయాయి. ఎందరో స్త్రీలు మారారు.

రాను రాను ఆ ధనికుడివంట్లో సత్తువ తగ్గిపోయింది. వృద్ధాప్యం ముంచుకొచ్చింది. రోగాలు బయటపడ్డాయి. మనిషి మంచాన పడ్డాడు.

ఈ గెస్టౌసు కూడా పాతపడి పోయింది. ఆ ధనికుడు కొడుకులు కూడా తండ్రిలాగే విలాసపురుషులు. కాని ఆయన రసికత వీళ్ళకు రాలేదు. స్నేహితుల్తో ఎప్పుడో యిక్కడికి వస్తుంటారు. త్రాగి తందనాలాడుతుంటారు. కేకలూ, అరుపులూ, పేకాటలూ - ఆ రెండ్రోజులూ అంతా కంగాళీ కంగాళీ చేసిపోతుంటారు. వీళ్ళు కూడా ఎప్పుడైనా ఆడవాళ్ళను తీసుకొచ్చేవాళ్లు. ఛీ, ఏం ఆడవాళ్ళు వాళ్ళు! మొగరాయిళ్ళు లాగా చొక్కాలూ, షరాయిలూ వేసుకుంటారు. ఒక దాన్లోనూ ఆడతనం లేదు. ఎండుకు పోయిన మొహాలూ - కత్తిరించుకున్న జుత్తులు వ్రేలాడేసుకొని కొజ్జాలులాగా వుంటారు. నాకే చిరాకేసేది! దేనికీ సిగల్లేవు, జడల్లేవు. ఇక వీళ్ళు పూలేంపెట్టుకుంటారు. పువ్వుల్లో ఏం పడుకుంటారు? పువ్వుల్లేని శృంగారం అదొక శృంగారమా? ఎలాగైనా ఆ పాత కాలపు వాళ్ళకున్న రసికతా, సౌందర్య దృష్టి ఈ కాలం కుర్రవాళ్ళకు లేదు. రాదు! వడిలో పెట్టినా దడిలో పెట్టినా అని వుత్త ఆత్రం, హడావుడిన్నూ!

సరే, అస్సల విషయాని కొస్తాను. ఆ ధనికుడితో పాటు నా పనీ అయిపోయింది. అప్పట్లో చుట్టూ విస్తరించిన దట్టమైన కొమ్మల్తో, రెమ్మల్తో, పచ్చని ఆకుల్తో గుమ్మటంగా వుండేవాడ్ని. విరబూసిన పూలతో తెలిపాగా చుట్టుకున్న కోడె వయస్సు శోభనపు పెళ్ళి కొడుకులాగా వుండేవాడ్ని! ఇప్పుడు నా వంట్లో వోపిక తగ్గిపోయింది. నరాల సత్తువ సన్నగిల్లిపోయింది. నా వ్రేళ్ళ బలహీనమైపోయాయి. భూమిలోంచి నీళ్ళు పీల్చుకోలేక పోతున్నాను. తత్ఫలితంగా ఆహార ప్రక్రియను సరిగ్గా నిర్వహించలేకపోతున్నాను. ఆ పచ్చదనం పోయింది. ఆ లాలిత్యం పోయింది. ఆ నాటి మిడిసిపడే యవ్వనం చేజారిపోయింది. పువ్వుల్ని పుష్పించలేక పోతున్నాను. మోడయిపోయాను. ముసలివాడ్ని అయిపోయాను.

నా జీవశక్తులన్నీ వుడిగిపోయాయి. బరువుగా వంటరి బ్రతుకీడుస్తున్నాను. నన్నెవరూ పట్టించుకోవటం లేదు. నాలోని ఆ పాత వైభవమంతా పోయింది. ఈ తోటకే దిష్టిబొమ్మలాగా వున్నాను. తోటమాలి రంగన్న నన్నెప్పుడో సమూలంగా నరికివేస్తాడు. అంతటితో ఈ జీవితం పరిసమాప్తం అవుతుంది.

ఈ లోపల -

ఈరోజు - ఈ మునిమాపువేళ ఈ నిశ్శబ్ద వాతావరణంలో ఈ గంట మ్రోత విన్నాను. గట్టుమీది ఆ దీపాన్ని కన్నాను. నాలో వింత అలజడి మొదలైంది. నాలోని జీవాత్మ జివజివలాడింది.

ఆ రోజాదిగా ప్రతిరోజూ ఆ గంట మ్రోత వింటున్నాను. ... ఆ చిరుదివ్వెను చూస్తోన్నాను.

అలా విన్నప్పుడల్లా ఆ గుడి గంట నా గుండె గుడిలో ప్రతిధ్వనిస్తోన్నట్లనిపిస్తోంది...... ఆ గుడి దీపం నా అంతరాంతరాల్లోని నా గత జన్మలానుగతమైన పాపపు చీకటి మీద చిరువెలుగై పడుతున్న అనుభూతి నాలో మొదలైంది.

గట్టుమీద పాతబడ్డ గుడంట - ఒక ముసలి పూజారంట - ఆ గుడిలో శివలింగమంట - ఆ శివయ్యకు పూజంట - ఇదా గుడి గంటంట - అది ఆ శివయ్య ముందు పెట్టిన దీపం అంట - ఇలా తలుచుకుంటుంటే నాలో ఇదీ అని చెప్పలేని వింత భావపుంజాలు పురివిప్పుకుంటున్నాయి. గుండె కుదుళ్ళు కదల్లాడుతున్నాయి.

అయ్యో, ఆ శివయ్యను కళ్ళతో చూస్తే ఎంత బాగుండును? నా గుండె ఆయన మ్రోల వాలగలిగితే - అంత పున్నెం కూడానా ఈ పాపిష్టి ముండాకొడుక్కి?

ఒకరోజు రంగన్న భార్య గుడికెళ్ళుతూ పూజకోసం పూలు కోయడానికి మాచెట్ల మధ్యకొచ్చింది. నా ప్రక్కనుంచే నన్ను దాటుకు పోతూంది...

"అమ్మా అమ్మా! నా పూలు కూడా కోయమ్మా! ఆ శివయ్యకు తీసికెళ్ళి అలంకరించమ్మా - నా పూలతో ఆ శివయ్యను పూజించమ్మా!" అని పిలవబోయాను.

.... అయ్యో, నా మతి మండా! నాకాడ పూలు కూడా వున్నాయా? వున్నదొక మోడు! గిడసబారిన కొమ్మలు, నేలరాలుతున్న పండిపోయిన ఆకులూ!

అయ్యో, నాదెంత దౌర్భాగ్యపు బ్రతుకు!

నేను బుట్టల కొద్దీ పూలు పుష్పించిన ఆ రోజుల్లో ఈ శివయ్య ఎక్కడికెళ్ళాడు? ఎక్కడికి పోతాడు - ఈ ఆదిదేవుడు వుండే వుంటాడు! కామం కళ్ళకెక్కి నాకే కనిపించలేదు! నాకు కనిపించిందల్లా ఈ కాముకీ జనం - ఆ కామినుల అంగాంగ సౌందర్యం, వాళ్ళ కేశపాశాలూ, వాళ్ళ హొయలూ, సోయగాలున్నూ!

వాళ్ళ పయ్యెదల క్రిందకు చేతులు చాచాలనీ, వాళ్ళ సుందర నాభీ స్థలాల్లో పవ్వళించాలనీ, వాళ్ళ సన్నని నడుముల్ని అల్లుకుపోవాలనీ, వాళ్ళ ఘన జఘనాల క్రింద నలగాలనీ, వాళ్ళ దీర్ఘ కేశపాశాలు పట్టుకొని వ్రేలాడాలనీ, వాళ్ళ కంఠసీమలను అలంకరించాలనీ, వాళ్ళ వక్షసీమల స్పర్శలో పులకించిపోవాలనీ, - ప్రతి పువ్వూ నేనంటే నేనని పోటీలు పడ్డాయి ఆ రోజుల్లో!

వాళ్ళకోసం వేగిరపడ్డది నా మనస్సు. ఏనాడూ ఈ గట్టు మీదకి దృష్టి సారించలేదు. ఈ శివయ్య గురించి ఆలోచించలేదు. మనస్సు లోకి మనస్సు పెట్టి చూచుకోలేదు. వయస్సు తొందరే గానీ, నెమ్మదిగా నాలోకి నేను చూచుకోలేదు. భక్తీ ముక్తీ నాస్తి! వున్నదంతారక్తీ, భోగలాలసతే!

ఈనాడు ఈ శివయ్య పొలకువ తెల్సి, ఆయన పాదాల చెంత తల వాలుద్దామంటే నాకాడ ఒక్కటంటే ఒక్కటన్నా పువ్వు లేదే! ఆనాడు గొప్ప దాత లాగా అడిగిన వాళ్ళకూ, అడగని వాళ్ళకూ నా పువ్వు సంపదనంతా విరజిమ్మాను - తీసికోండి పోండంటూ చెట్టంతా చేతులు చేసుకొని వెదజల్లాను. ఈనాడు కడు బికారినయిపోయాను! ఈ శివయ్యకు ఒఖ్ఖ పువ్వును కూడ యివ్వలేని హీనస్థితిలో వున్నాను! ఇప్పుడు పుష్పించే శక్తి నాకు లేదు! నా సత్తువనంతా ఈ ముండలకే ధారపోశాను.....

అదిగో, ఆ అమ్మ మందారపువ్వులు కోసి చెంగులో వేసుకొని తీసుకుపోతూంది - ఆ శివయ్యను అలంకరించడానికి. ఆ మందార చెట్టు ఎంత పున్నెం చేసుకుందో!

నేనూ ఒక పువ్వు పూస్తాను. నా జీవశక్తులన్నీ కూడగట్టుకుంటూ, నా మనోమృత్తిక లోని జీవసారాన్ని పీల్చుకుంటూ, నా గుండె పొరల్లోంచి మొగ్గ తొడుగుతూ, నా ఆత్మలోంచి వూపిరి దీసుకుంటూ మెల్లమెల్లగా వికసిస్తూ - అందులో నా భక్తి పరిమళాలను నింపుతూ నా 'ఆఖరి పువ్వు' పూస్తాను - నా జీవితం పరిసమాప్తం అయ్యే లోపల.

ఆ పువ్వు ఆ శివయ్యకే అర్పిస్తాను. నా గతపాపాలను కడిగేసుకుంటాను.... నా జన్మ చరితార్థం చేసుకుంటాను!

ఇక ఈ క్షణం నుంచి నేనిదే పనిమీద వుంటాను....

- 'రచన' సంక్రాంతి విశేష సంచిక, ఫిబ్రవరి 1993

★